

ఆర్టీసీలో అద్దె బస్సుల హవా

ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరిగిపోతోంది. కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా, పాత బస్సులు నడపకుండా అద్దె బస్సులపైనే సంస్థ ఆధారపడుతోంది. 8లో ▸



పసుపు రైతుకు కన్నీరు

పసుపు సాగు చేసిన రైతులకు ఈసారి పెట్టుబడులు రాని పరిస్థితి ఉంది. ఎకరాకు రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక లబోదిబోమంటున్నారు. 9లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
37.3 / 17.3

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగలు ఎండ తీవ్రత అధికమవుతుంది. రాత్రి చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్ పర్యటన రద్దు

నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బుధవారం చేపట్టిన పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. సీఎం కేసీఆర్‌తో అత్యవసర సమావేశం ఉండగా రద్దయినట్లు తెలుస్తోంది. ఒకానొక సందర్భంలో హెలిక్యాప్టర్ ద్వారా జిల్లాకు రావచ్చు అన్న సంకేతాలు కూడా పార్టీ వర్గాలు అందించాయి. మధ్యాహ్నం 12 గంటలకు హరీశ్‌రావు నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల పర్యటన రద్దయిందని అధికారులు తెలిపారు. దీంతో నిర్మల్ జిల్లా ఆసుపత్రితో పాటు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, విఠల్‌రెడ్డి, రేఖానాయక్‌తో కలిసి ప్రారంభించారు.

‘వినియోగదారులపై భారం మోపొద్దు’



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భైంసాటౌన్: కేబుల్ టీవీ వినియోగదారులపై భారం మోపేలా ట్రాయ్ కొత్త నిబంధనలున్నాయని, వాటిని వెంటనే నిలిపేయాలని భైంసా డివిజన్ కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆదిలాబాద్‌లో ఎంపీ సోయం బాపూరావును కలిసి విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎంపీ కేంద్రప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు నాంపల్లి రత్నం, ఉపాధ్యక్షుడు పోతాజీ, సలహాదారు పురుషోత్తం, కార్యదర్శి లక్ష్మణ్ తదితరులున్నారు.

‘కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి’



బాదన్‌కుర్తిలో మాట్లాడుతున్న రాథోడ్ రమేశ్

ఖానాపూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలమైన సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సూచించారు. బుధవారం మండలంలోని బాదన్‌కుర్తి, సుర్జాపూర్‌తో పాటు పట్టణంలోని శాంతినగర్ కాలనీల్లో శక్తి కేంద్రం ఇన్‌చార్జీలు బుచ్చన్నయాదవ్, చుక్క సురేందర్, సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు హాజరై మాట్లాడారు. ప్రజాసమస్యలపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం కారణంగా రాష్ట్రంలో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారన్నారు. కేసీఆర్‌ను గద్దె దించితేనే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందన్నారు. నాయకులు రావుల రాంనాథ్, రాజేశ్వర్‌రెడ్డి, పడాల రాజశేఖర్, భూక్యా జానుబాయి, టేకు ప్రకాశ్, నాయిని సంతోష్, తోకల వెంకటేశ్, వెంకటస్వామి, గుడాల రాజన్న, సూర్య, రణవీర్, ఉపేందర్, గిరి, రవి, లింబాద్రి, వెంకటరమణ, ఆకుల శ్రీనివాస్, ఆనంద్, మహేందర్, రుస్తుం, లింగన్న, శ్రావణ్, మనోజ్, సాయి తదితరులున్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు మరమ్మతు



రహదారి మరమ్మతు చేయిస్తున్న ఎస్‌ఐ

దస్తురాబాద్: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేసే పోలీసులు ఆదివాసీ గూడెంవాసులకు రహదారి సౌకర్యం కల్పించారు. వివరాలు.. మండలంలోని ఆకోండపేట గ్రామపంచాయతీ పరిధి గోండుగూడా ఆదివాసీలకు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది జూలై వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు గోండుగూడా గ్రామానికి వచ్చే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారి లేక ఆదివాసీలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలుసుకున్న ఎస్‌ఐ ప్రభాకర్‌రెడ్డి సిబ్బందితో రెండురోజులుగా ట్రాక్టర్లు, జేసీబీ తెప్పించి మట్టితో రహదారికి మరమ్మతు చేయించారు. గోండుగూడాకు రహదారి సౌకర్యం కల్పించారు. బుధవారం ఖానాపూర్ సీఐ నారాయణనాయక్ ఆదివాసీ గూడేనికి వచ్చి రహదారి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. అనంతరం గోండుగూడా గ్రామాన్ని సందర్శించి గూడెం పటేల్, ఆదివాసీలతో మాట్లాడారు.

ఆయిల్‌పాం సాగు చేయాలి

భైంసారూరల్: రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టిసారించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం తిమ్మాపూర్‌లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. హరితహారం నర్సరీలను పరిశీలించారు. ఈజీఎస్ ఏపీఎం శివలింగం, సిబ్బంది ఉన్నారు.

ఇంటిపోరు ఇంతింతై..!

- అన్ని పార్టీల్లో అంతర్గత కలహాలు
- ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోలా..
- ‘కారు’లో చెరో తీరుగా సీనియర్లు
- ‘కమలం’లోనూ కలహాల కాపురం
- కాంగ్రెస్‌లో తగ్గిన మునుపటి జోరు
- అయోమయంలో పార్టీల కార్యకర్తలు



నిర్మల్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రధాన పార్టీలను సమస్యలు వేధిస్తున్నాయి. ఎదుటి పక్షాన్ని ఎదుర్కోవాల్సిన సమయంలో స్వపక్షాన్ని సరిదిద్దుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ పార్టీ.. ఈ పార్టీ.. అని కాకుండా జిల్లాలో మూడు ప్రధాన పార్టీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న ‘కారు’లో చెరో తీరుగా సీనియర్ల వ్యవహారం కొనసాగుతోంది. ప్రధాన ప్రతిపక్షంగా పేర్కొనే కాంగ్రెస్‌లో మునుపటితో పోలిస్తే జోరు తగ్గింది. ఓవైపు ప్రజాదరణ పెరుగుతున్నా సొంతింట్లో కలహాల కాపురం కమలం పార్టీని పరేషాన్ చేస్తోంది. రానున్న ఎన్నికలు ఈ మూడు ప్రధాన పార్టీలకు చాలా ప్రతిష్టాత్మకం. ఇలాంటి సందర్భంలో ఇలా స్వపక్షాన్నే సరిదిద్దుకునేందుకు సమయాన్ని వెచ్చించాల్సిన అవసరం ఏర్పడింది.

‘కారు’లో వర్గపోరు..!

ఇప్పుడున్న సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ టికెట్లు ఇస్తామని ఈమధ్య సీఎం కేసీఆర్ చెప్పినప్పటి నుంచి ఆశావహులు జీర్ణించుకోవడం లేదు. పాతవాళ్లపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నా వాళ్లనే మళ్లీ ఎలా అభ్యర్థులుగా ప్రకటిస్తారని కార్యకర్తల వద్ద కొంత మంది చర్చిస్తున్నారు.

- నిర్మల్ నియోజకవర్గంలో పైకి అంతా కలిసి ఉన్నట్లే కనిపిస్తున్నా.. అంతర్గతంగా ఎవరికి వారే అన్నట్లు ఉన్నారు. మంత్రి అల్లోలకు పెద్దగా వ్యతిరేకత లేకున్నా.. ఒకరిద్దరు సీనియర్లు అంటీముట్టనట్లుగా ఉండడం కలవరపెడుతోంది. ప్రజల్లో అంతగా పట్టులేని ఒకరిద్దరికి మినహా మంత్రి ఎవరికీ ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఒకప్పటి ఉమ్మడి జిల్లా టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పశ్చిమ ప్రాంత అధ్యక్షుడిగా కొనసాగిన కూచాడి శ్రీహరిరావుకు ఇప్పటికీ తనకంటూ ఓ ప్రత్యేక వర్గం కొనసాగుతోంది. మరో రాష్ట్రస్థాయి నేత, జిల్లాలో సీనియర్‌గా పేరున్న వల్లకొండ సత్యనారాయణగౌడ్ కూడా మంత్రికి దూరంగానే ఉంటున్నారు. ఇటీవల ఈయన ఇంటికి బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి రావడం చర్చనీయాంశమైంది. తమది వ్యక్తిగత పరిచయంగా సత్యనారాయణగౌడ్ పేర్కొన్నారు. వీరితో పాటు ఇటీవల మున్సిపల్‌లో జరుగుతున్న పరిణామాలూ పార్టీపై సొంత నాయకుల్లోనే వ్యతిరేకతను పెంచినట్లు తెలుస్తోంది.
- ఖానాపూర్ నియోజవర్గంలో బీఆర్‌ఎస్‌లో ఎమ్మెల్యే రేఖానాయక్ అంతా తానే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కానీ.. ఆమెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, తమకే ఈసారి పార్టీ టికెట్ ఖాయమని పలువురు పార్టీ నేతలు ప్రచారం చేసుకుంటున్నారు. ఆదిలాబాద్ జెడ్పీచైర్మన్ జనార్దన్ రాథోడ్, పార్టీ ఎంపీ సంతోష్‌రావుకు దగ్గరి మనిషిగా ఉన్న పూర్ణచందర్‌నాయక్, రిటైర్డ్ ఐఏఎస్ శర్మన్‌నాయక్‌తో పాటు కొత్తగా మంత్రి కేటీఆర్ స్నేహితుడు, మెట్‌పల్లికి చెందిన ఎన్‌ఆర్‌ఐ జాన్సన్‌నాయక్ పేరు కూడా ఖానాపూర్ ‘కారు’ టికెట్ ఆశిస్తున్న వారిలో ఉంది. ఇప్పటికే ఆశావహులు మండలాల్లో తరచూ పర్యటనలు, సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. తమకంటూ ఓటు బ్యాంక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.
- ముధోల్ నియోజకవర్గంలో కారుకు పెద్దగా ఇబ్బందులు లేవు. ఇక్కడ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పోటీ అంటూ లేదు. కానీ.. ప్రస్తుత ఐడీసీ చైర్మన్, మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి మళ్లీ పోటీలోకి రావచ్చేమోనన్న అనుమానాలు వీడడం లేదు. అప్పుడప్పుడు నియోజకవర్గానికి రావడం, ఆయనకంటూ ఇక్కడ వర్గం ఉండడం కలవరపెడుతూనే ఉంది.

కాంగ్రెస్‌లో కనిపించని జోష్!

ఒకప్పుడు జిల్లాలో ఊపు ఊపిన హస్తంపార్టీలో ప్రస్తుతం జోష్ కనిపించడం లేదు. నిర్మల్ నియోజకవర్గంలో ఏకఛత్రాధిపత్యం చేస్తున్న ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మిగతా నియోజకవర్గాలపైనా ప్రభావం చూపుతున్నారు. రాష్ట్రస్థాయి నేతగా ఎదిగినా ఆయన లోకల్‌గా అందుబాటులో ఉండడం లేదన్న ఒక్క ఆరోపణ మొత్తం పార్టీని డీలాపరుస్తోంది. ముధోల్‌లో బలమైన నేతగా ఉన్న డీసీసీ మాజీ అధ్యక్షుడు రామారావు పటేల్ పార్టీని వీడి బీజేపీలో చేరడం, ఆ స్థాయి నాయకులు లేకపోవడం నియోజకవర్గంలో ఇబ్బందిగా మారింది. ఖానాపూర్‌లో జిల్లాకు చెందిన నేతలెవరూ పోటీలో లేరు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన వెడ్మ బొజ్జుతో పాటు అక్కడి జెడ్పీటీసీ చారులత, భరత్‌చౌహాన్‌తో పాటు పలువురు ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్నారు.

‘కమలం’లో వేరు కుంపట్లు..!

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో జనాదరణ పెంచుకుంటున్న బీజేపీకి ఇంటిపోరు కూడా ఇంతింతై వటుడింతై అన్నట్లు పెరుగుతూ పోతోంది. జిల్లాలో ప్రజాసంగ్రామ యాత్రతో పెరిగిన క్రేజ్‌ను కార్నర్‌మీటింగ్‌లతో మరింత పెంచుకునే ప్రయత్నం జరుగుతోంది. కానీ.. సొంతపార్టీలోనే నేతల మధ్య వేరు కుంపట్లు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను పరేషాన్ చేస్తున్నాయి.

- నిర్మల్ నియోజవర్గంలో సీనియర్లు చాలామంది ఉన్నప్పటికీ ప్రస్తుతం డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ అప్పాల గణేశ్‌చక్రవర్తి ఎమ్మెల్యే టికెట్ రేసులో ఉన్నారు. ప్రజాసంగ్రామయాత్ర నుంచి వీరిద్దరూ వేర్వేరుగా ప్రజల్లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు.
- ముధోల్ నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు, రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయిన పడకంటి రమాదేవి, డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి కాషాయ కండువా వేసుకున్న రామారావుపటేల్, సీనియర్ నాయకుడు మోహన్‌రావుపటేల్ మధ్య పోటాపోటీ వాతావరణం ఉంది. ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా ఈ ముగ్గురు కలిసి నిర్వహించడం లేదు. ఎవరికి వారు పెద్దపెద్ద ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నారు. ఇది కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తోంది.
- ఖానాపూర్ ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం. ఒకప్పుడు కమలం ఊసులేని ఇక్కడ ఇప్పుడు పార్టీ టికెట్‌కోసం పోటాపోటీ నెలకొంది. మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్‌తో పాటు పెంబి జెడ్పీటీసీ సభ్యురాలు జానుబాయి, సీనియర్ నేత హరినాయక్, గత ఎన్నికల్లో పోటీ చేసిన సట్ల అశోక్ టికెట్ ఆశిస్తున్నారు. ఎవరికివారు వర్గాలుగా విడిపోయి తమకే టికెట్ వస్తుందన్న తీరులో పనిచేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- సీటీస్కాన్ సేవలు ప్రారంభం



సీటీస్కాన్ సేవలు ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.1.5 కోట్లతో ఏర్పాటు చేసిన సీటీస్కాన్ యంత్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీస్కాన్ ఏర్పాటుతో పేద ప్రజలకు ఆర్థిక, దూరభారం తగ్గిందన్నారు. మాతా శిశు సంరక్షణకు చేపట్టిన చర్యలతో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగిందని తెలిపారు. రూ.42 కోట్లతో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. వైద్య కళాశాల ఏర్పాటుకు రూ.166 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. త్వరలో సీఎం కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రూ.30 కోట్లతో మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, మున్సిపాలిటీ పరిధిలో రెండువేల డబుల్ బెడ్రూంలను నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. 1200 ఇండ్ల నిర్మాణం పూర్తి దశలో ఉన్నట్లు చెప్పారు. జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్, సూపరింటెండెంట్ దేవేందర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో అలసత్వం వద్దు

- వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఆదేశం
- భైంసా ఏరియాస్పత్రి తనిఖీ



మాట్లాడుతున్న టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్

భైంసాటౌన్: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సేవలందించడంలో వైద్యులు అలసత్వం వహించవద్దని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ జే అజయ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం భైంసా ప్రభుత్వ ఏరియాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా వార్డులవారీగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు జిల్లాలవారీగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న, అందించాల్సిన సేవలపై తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే భైంసా ఏరియాస్పత్రిని సందర్శించినట్లు తెలిపారు. ఆస్పత్రిలో దాదాపు అన్ని విభాగాల్లో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఈఎన్టీ, డెంటల్ విభాగాల్లో ఆశించిన మేర సేవలందడం లేదని తెలిపారు. ఆప్తాల్మాలజీ విభాగంలో అవసరమైతే థియేటర్ ఏర్పాటుకు ప్రతిపాదిస్తామని పేర్కొన్నారు. గైనిక్ విభాగంలో సిజేరియన్లు ఎక్కువగా జరుగుతున్నాయని, తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యులు ఎల్లప్పుడు రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట డీసీహెచ్‌వో దేవేందర్‌రెడ్డి, ఏరియాస్పత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, వైద్యులు సురేందర్, విజయానంద్, సిబ్బంది ఉన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలకు ఆహ్వానం



మంత్రికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న సభ్యులు

నిర్మల్‌టౌన్: ఈ నెల 24న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సంత్ శ్రీసేవాలాల్ జయంతి వేడుకలకు హాజరు కావాలని బంజారా సేవా సమితి జిల్లా సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆయన నివాసంలో ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖానాయక్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బంజారా సేవా సమితి సభ్యులు తుకారాం, రాందాస్, గణేశ్, రవీందర్, సంతోష్ తదితరులున్నారు.

మంత్రికి బర్డ్‌ఫీడర్ అందజేత

జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసానికి సామాజిక కార్యకర్త వెంకటేశ్ వెళ్లారు. మంత్రికి బర్డ్‌ఫీడర్ అందజేశారు. పక్షులను రక్షించాలని వెంకటేశ్ ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన పీహెచ్‌సీ సిబ్బంది

నిర్మల్ రూరల్ మండలం ముజ్గి పీహెచ్‌సీ సిబ్బంది, వైద్యులు, సర్పంచ్ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముజ్గి పీహెచ్‌సీ జాతీయ హెల్త్‌మిషన్‌లో చోటు సంపాదించడంపై వైద్య సిబ్బందిని మంత్రి అభినందించారు.

పరీక్షలకు ప్రణాళికతో సిద్ధం కావాలి



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డీఈవో

తానూరు: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ప్రణాళికతో సిద్ధం కావాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని బోరిగాం, తానూరు కేజీబీవీ, ఎల్వి జెడ్పీ హైస్కూల్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. బోరిగాం పాఠశాలలో జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యులు పదో తరగతి అంతర్గత మార్కుల మదింపును పరిశీలించగా వివరాలు తెలుసుకున్నారు. ఎంఈవో సుభాష్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మల్లన్న, మాధవ్‌రావ్, ఉపాధ్యాయులున్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షల పరిశీలన



ప్రయోగ పరీక్షను పరిశీలిస్తున్న పరశురామ్‌నాయక్

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలను బుధవారం జిల్లా ఇంటర్ నోడల్ అధికారి పరశురామ్ నాయక్ పరిశీలించారు. ఆయన వెంట డెక్ మెంబర్ రవికిరణ్ ఉన్నారు.

మూడింటిపైనే మక్కువ!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రవాణా శాఖలో కొందరు అధికారుల తీరు వివాదాస్పదమవుతోంది. తమకు అనుకూలమైనవారికి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల్లో పోస్టింగ్ ఇస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ మూడింటిపైనే అందరూ మక్కువ చూపుతుండడం గమనార్హం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్ములో వాటా తీసుకుని పంచుకుంటున్నారనే ప్రచారమూ సాగుతోంది.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

- ఆ చెక్‌పోస్టుల్లో డ్యూటీ కోసం పోటీ
- పైరవీలతో ఆన్‌డ్యూటీ ఉత్తర్వులు
- విధుల కోసం రవాణా ఆఫీసర్ల మధ్య లొల్లి
- భోరజ్ చెక్‌పోస్టులో నిలిచిన ‘మూవ్‌మెంట్’



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం భోరజ్‌లో రవాణా శాఖ చెక్ పోస్టు



తానూరు మండలం బేల్‌తరోడాలోని చెక్‌పోస్టు



వాంకిడిలోని రవాణాశాఖ చెక్‌పోస్టు

ఉమ్మడి జిల్లాలో మూడు చోట్ల ఆర్టీఏ చెక్ పోస్టులు ఉన్నాయి. అంతర్రాష్ట్ర సరిహద్దులుగా ఉన్న రహదారులైన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం 44 నంబర్ జాతీయ రహదారిపై భోరజ్ వద్ద, నిర్మల్ జిల్లా తానూరు మండలం బెల్‌తరోడా వద్ద, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రం శివారులో రవాణాశాఖ చెక్ పోస్టులున్నాయి. ఆరేళ్లుగా రాష్ట్ర రవాణాశాఖలో సాధారణ బదిలీలు చేయలేదు. కొత్త నియామకాలు కూడా లేకపోవడంతో ఉన్న సిబ్బందినే సర్దుబాటు చేస్తున్నారు. దీంతో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఎంవీఐ), అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు(ఏఎంవీఐ), కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది ఆఫీసులో కంటే ఈ మూడు చెక్‌పోస్టుల్లో పని చేసేందుకు మక్కువ చూపుతున్నారు. అయితే రెగ్యులర్, కాకుంటే ఓడీ (ఆన్ డ్యూటీ), డిప్యూటేషన్, ఇన్‌చార్జి ఇలా ఏదో రకంగా చెక్‌పోస్టు విధుల్లో వాలిపోతున్నారు. ఇందుకోసం అధికారికంగానే ‘పైరవీ బదిలీలు’ సాగుతున్నాయి. రాజకీయ, అసోసియేషన్, ఇతర మార్గాల పైరవీలతో ఎంతైనా వెచ్చించి, ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. అలా ఉమ్మడి జిల్లాలో పలువురు అధికారులు చెక్‌పోస్టు డ్యూటీల కోసం పోటీ పడుతున్నారు.

భోరజ్ చెక్ పోస్టులో ముసలం

ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ప్రభుత్వానికి, ఇటు అధికారులకు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న భోరజ్ చెక్ పోస్టు వద్ద కొద్ది రోజులుగా డ్యూటీల కోసం రగడ నడుస్తోంది. మంచిర్యాల, ఆసిఫాబాద్, వరంగల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల నుంచి ఓడీ ఆర్డర్లతో అక్కడ రవాణా అధికారులకు విధులు కేటాయించారు. ఇక్కడ ఏడు రెగ్యులర్ పోస్టులు కాగా, మిగతావారంతా ఇన్‌చార్జీలే. ఎంవీఐ, ఏఎంవీఐలు కలిపి 20 మంది విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్కొక్కరికి నెలలో ఒకటి, అర డ్యూటీలు మాత్రమే వస్తున్నాయి. ఇటీవల ఈ డ్యూటీల కోసం ఓ సీనియర్ ఎంవీఐ, జూనియర్ల మధ్య వివాదం రాజుకుంది. ఆ సీనియర్ అధికారి తనకే ఎక్కువ డ్యూటీలు ఇవ్వాలని.. కుదరకపోతే, భారీ మొత్తంలో ముట్టజెప్తేనే ఓడీలపై వచ్చిన అధికారులను డ్యూటీలకు అనుమతిస్తామనడంతో మిగతా వాళ్లు నిరసన తెలుపుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడం, ఓ అధికారి డ్యూటీ చేయనీయకపోవడంపై పెట్రోల్ సీసాతో ఆత్మహత్యాయత్నానికి సైతం పాల్పడం చోటు చేసుకుంది. ఈ వివాదంతో తమ వసూళ్ల ‘మూవ్‌మెంట్’కు ఇక ఆటంకం కలుగుతోందని ఆ అధికారులే చెప్పడం గమనార్హం.

ఓడీల పేరుతో విధులు

మూడు చెక్ పోస్టుల్లోనూ అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా స్థానికంగా ఉన్న అధికారుల కంటే వివిధ జిల్లాల నుంచి ఆన్ డ్యూటీపై వచ్చి పని చేస్తున్నవారే ఎక్కువయ్యారు. నిర్మల్ జిల్లా బెల్‌తరోడాకు ఏడుగురిలో ఇద్దరు కరీంనగర్ నుంచి ఓడీపై వచ్చారు. మంచిర్యాల నుంచి నలుగురు ఎంవీఐలు, ఓ ఏఎంవీఐ భోరజ్ చెక్ పోస్టుకు ఓడీపై కేటాయించారు. వాంకిడిలో మరో ఏఎంవీఐకి ఆన్‌డ్యూటీ వేశారు. వాంకిడిలో పని చేస్తున్న వారిలో ఒకరు సస్పెండ్ కాగా, మిగిలిన వారిలో నలుగురు జిల్లా ఆఫీసు డ్యూటీవారు, మరో ఏడుగురు బయటి నుంచి ఓడీ, డిప్యూటేషన్‌పై వచ్చినవారే. కొందరైతే బదిలీపై వేరే చోటుకు వెళ్లి, స్వల్పకాలంలోనే తిరిగి మళ్లీ చెక్ పోస్టు డ్యూటీ తెచ్చుకుని విధులు నిర్వహిస్తున్నారు. చెక్ పోస్టు డ్యూటీ, అటూ ఆఫీసు డ్యూటీతోపాటు తనిఖీలు చేస్తున్నారు. ఇలా సిబ్బంది కొరత సాకుతో అదనపు డ్యూటీలతో అక్కడ మేమే.. ఇక్కడా మేమే అన్నట్లుగా రవాణా శాఖ అధికారుల విధులు సాగుతున్నాయి. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగింపు వేళ రవాణా శాఖలో డ్యూటీల రగడ కొనసాగుతుండడం గమనార్హం.

రూ.లక్షల్లో అనధికారిక వసూళ్లు

24 గంటల వ్యవధిలో మూడు షిఫ్టులు (ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో) ఐదు, తొమ్మిది, పది గంటల చొప్పున డ్యూటీలు చేయాలి. విధుల్లో ఉన్న అధికారులు చెక్‌పోస్టు గుండా వెళ్లే వాహనాల పర్మిట్, ఓవర్ లోడ్, లైసెన్సులు, ట్యాక్స్‌లు, రవాణాశాఖ నిబంధనల మేరకు అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయా? లేవా? చెక్‌చేసి పంపాలి. ఏవైనా సరిగా లేకపోతే జరిమానా విధించాలి. ఈ జరిమానాలు, వాహనాల పన్నులతో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం వస్తోంది. వీటితోపాటు ఇక్కడ విధులు నిర్వహించే అధికారులు వాహనాల డ్రైవర్ల నుంచి అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారు. రోజుకు కనీసం రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అనధికారిక వసూళ్లు జరుగుతాయంటే అర్థం చేసుకోవచ్చు. ప్రైవేట్ సిబ్బంది, తిండి, ఇతర ఖర్చులు పోనూ మిగతాది డ్యూటీ అధికారి జేబులోకి వెళ్తుంది. ఈ ఆదాయం కోసమే పెద్ద ఎత్తున ప్రైవేట్ సిబ్బంది అక్కడ పని చేస్తుంటారు. ఇదంతా ఉన్నతాధికారులకు తెలిసే జరుగుతోంది. ఈ సొమ్ములో ఎవరి స్థాయిలో వారికి వాటాలు వెళ్తున్నాయి. దీంతో ఎవరూ నోరు మెదపరు. రూ.లక్షలు ఖర్చు చేసి డ్యూటీలు తెచ్చుకుని, రెట్టింపు ఆర్జన కోసం ఆరాటపడుతున్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తానూరు: మండలంలోని మహలింగి శివారు ప్రాంతంలో మహారాష్ట్రలోని దివశీ గ్రామానికి చెందిన ఉస్కెవాడ్ గజానంద్ (25) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని దివశీ గ్రామానికి చెందిన అనుషయాబాయి ఆమె కుమారుడు గజానంద్ మూడు రోజుల క్రితం తానూరు మండలం మహలింగి గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చాడు. మంగళవారం గజానంద్ తమ గ్రామం దివశీకి వెళ్తున్నట్లు చెప్పాడు. బుధవారం గుట్ట ప్రాంతంలో రైతులకు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సంఘటన స్థలానికి ఎస్సై విక్రమ్ చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. బాధితుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మృతుడికి భార్య శివానితో పాటు కూతురు ఉంది.

ముగిసిన రాజరాజేశ్వర జాతర



శోభాయాత్రగా దొంతులతో వచ్చిన భక్తులు

కుభీర్: మండలంలోని పార్డి(బీ) గ్రామంలో ఐదురోజులుగా కొనసాగుతున్న రాజరాజేశ్వర జాతర ముగిసింది. బుధవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర కుస్తీపోటీలు ఆకట్టుకున్నాయి. హర్యానాకు చెందిన సోయం బాబు ప్రథమ స్థానంలో నిలిచి రూ.5,500 నగదు బహుమతి గెలుచుకున్నారు. దేవత విగ్రహాలకు గంగాస్నానం, అభిషేకాలు, దేవుని కల్యాణం, అంబళ్లు, నాగవెల్లి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. జాతరలో పార్డి(బీ), హల్దా, చాత, రంగశివుని, కుభీర్, మార్లగొండ, రాజురా, మహాగావ్, జుమ్డ, దార్‌కుభీర్, బెల్గాం తదితర గ్రామాల భక్తులతోపాటు మహారాష్ట్రలోని పలుగ్రామాల మల్లయోధులు పాల్గొన్నారు. జాతర ఏర్పాట్లను సర్పంచ్ పుష్ప, ఎంపీపీ తూము లక్ష్మీబాయి, ఆలయ కమిటీ అధ్యక్షుడు వీ మోహన్, కమిటీ సభ్యులు సురేశ్, బాబు, మిలింద్ పరిశీలించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శంఖర్, సర్పంచులు అర్చన, శంకర్, సాయన్న, పార్డి(డీ)గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దుతో రైతు శివుడు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో రైతు ఇర్ల శివుడికి చెందిన ఎద్దు బుధవారం విద్యుద్ఘాతంతో మృతి చెందినట్లు రైతు వాపోయాడు. బాధిత రైతు వివరాల ప్రకారం.. తన పంట చేనులో ఎద్దు మేతమేస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ తీగ తగిలిషాక్‌కు గురైంది. గమనించిన రైతు విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు సంఘటన స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎద్దు విలువ రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు.

రహదారిపై పిప్పల్‌కోటి ముంపు రైతుల ఆందోళన



రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న అంతర్రాష్ట్ర రహదారిపై బుధవారం పిప్పల్‌కోటి రైతులు ఆందోళన చేపట్టారు. పిప్పల్‌కోటి రిజర్వాయర్ నిర్మాణంతో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం పెంచి చెల్లించాలని ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ గ్రామ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించారు. జిల్లాకు మంత్రులు వస్తున్న సమయంలో భూ పరిహారం సమస్యను విన్నవించకుండా అరెస్ట్ చేయడం సరికాదన్నారు. రోడ్డుపై బైఠాయించి పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అరగంటకుపైగా ఆందోళన చేయడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో స్వచ్ఛందంగా ఆందోళన విరమించారు. రైతులు గంగారెడ్డి, స్వామి, విలాస్, దత్తు ఉన్నారు.

ఆర్టీసీలో అద్దె బస్సుల హవా

- ఏటా పెరుగుతున్న సంఖ్య
- తగ్గుతున్న ఆర్టీసీ సంస్థ సర్వీసులు
- ఆందోళనలో ఉద్యోగులు



మంచిర్యాలలో ఆర్టీసీ లగ్జరీ బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే దివాకర్‌రావు (ఫైల్)

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ సంస్థలో అద్దె బస్సుల సంఖ్య పెరిగిపోతున్నాయి. సంస్థ కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా.. పాత బస్సులు నడపలేక అద్దె బస్సులకు ప్రాధాన్యతనిస్తోంది. నిన్నమొన్నటి వరకూ నామమాత్రంగా ఉన్న హైర్ బస్సులు దాదాపు సగానికి సగం చేరాయి. కొత్త బస్సులు కొనుగోలు.. నూతన నియామకాలు చేపట్టకపోవటంతో సిబ్బందిలో ఆందోళన నెలకొంది. మరో వైపు ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్రం తీసుకువచ్చే నూతన వాహన చట్టం ప్రకారం 15ఏళ్లు దాటిన బస్సులు తప్పనిసరిగా తుక్కుగా మార్చకతప్పదు. ఈ లెక్కన మరో 10 బస్సులు తగ్గిపోయే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎక్కువ కాలం తిరిగిన బస్సుల్లో లగ్జరీ ఉన్నాయి. వీటి స్థానంలో ఇప్పటికే 19 బస్సులు రాగా పల్లెవెలుగు స్థానంలో 19 అద్దెబస్సులకు అనుమతిచ్చారు. ఉన్నతాధికారుల నుంచి ఎప్పుడు ఆదేశాలు వస్తే రాకపోకలు సాగిస్తున్న పాత బస్సులకు బ్రేక్‌లు పడే అవకాశాలున్నాయి.

పెరుగుతున్న అద్దె బస్సులు..

ఆర్టీసీ అద్దెబస్సులు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి. ఐదేళ్ల కిందట వరకు 146 బస్సులుండగా ఇందులో 93 ఆర్టీసీ, 53 అద్దెబస్సులున్నాయి. లాక్‌డౌన్ సెకండ్ వేవ్ ఆంక్షలు ఎత్తివేసేవరకు డిపోలో 142 బస్సులు కాగా 81 ఆర్టీసీ సంస్థకు చెందిన బస్సులు కాగా 61 అద్దె బస్సులున్నాయి. ప్రస్తుతం 142 బస్సుల్లో 73 ఆర్టీసీ బస్సులు కాగా 69 అద్దె బస్సులు చేరాయి. సంస్థ కొత్త బస్సులు కొనుగోలు చేయకపోవటం.. కాలం చెల్లిన బస్సుల స్థానంలో అద్దె బస్సులు తప్పనిసరిగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో అంతకంతకు అద్దెబస్సులు పెరిగిపోయాయి. ఇంకో మూడు, నాలుగు బస్సులు అటు ఇటైనా సగం దాటిపోయినట్లే.



అద్దె బస్సు ప్రారంభోత్సవంలో అధికారులు

తగ్గుతున్న సిబ్బంది..

అద్దె బస్సులు పెరిగిపోతుండగా ఆర్టీసీ బస్సులపై విధులు నిర్వహించే కండక్టర్లు, డ్రైవర్ల సంఖ్య తగ్గిపోతోంది. అద్దె బస్సుల్లో సంస్థ నుంచి కండక్టరు మాత్రమే ఉంటాడు. డ్రైవర్లు ప్రైవేట్ బస్సుల యజమాన్యాలు సమకూర్చుకుంటాయి. సంస్థ బస్సులైతే ఇద్దరు ఉద్యోగులు అవసరం. వేతనాలు చెల్లింపులు, ఇతరత్రా కారణాల నేపథ్యంలో సంస్థ అద్దెబస్సుల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ బస్సులు కాలక్రమేపీ తగ్గుముఖం పట్టడంతో 2017లో 225 మంది డ్రైవర్లు ఉండగా 264 మంది కండక్టర్లు ఉన్నారు. 2022 సంవత్సరం నాటికి డ్రైవర్లు 196, 254 కండక్టర్లు పడిపోయింది. ప్రస్తుతం 193 డ్రైవర్లు ఉంటే కండక్టర్ల సంఖ్య 231కు తగ్గుముఖం పట్టింది. ఈలెక్కన గతేడాదితో పోల్చితే ముగ్గురు డ్రైవర్లు, 23 కండక్టర్లు తగ్గిపోయారు. నూతన నియామకాలు చేపట్టకపోవడం ఓ కారణమైతే.. బదిలీపై వెళ్లిపోవటం.. స్వచ్ఛంద విరమణ పొందటం కూడా కార్మికుల సంఖ్య తగ్గిపోవడానికి తోడైంది. ఆర్టీసీ సంస్థ బస్సులు కొనుగోలు చేస్తే నూతన నియామకాలు చేపట్టాల్సి వస్తుందనే సాకుతోనే అద్దె బస్సులకు అవకాశం ఇస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అద్దె బస్సులు

మంచిర్యాల	63
ఆదిలాబాద్	66
నిర్మల్	76
ఆసిఫాబాద్	32

కాలం చెల్లిన బస్సుల స్థానంలో..

మంచిర్యాల డిపోలో కాలం చెల్లిన బస్సుల స్థానంలో నూతన బస్సులు వచ్చాయి. 19 బస్సులు కొత్తవి రాగా ఇక్కడి పాత బస్సులను హైదరాబాద్‌కు పంపించి సిటీ బస్సులుగా మార్పులు చేసి నడిపిస్తున్నారు. పల్లె వెలుగుల స్థానంలో మాత్రం సంస్థ బస్సులు కాకుండా 19 అద్దె బస్సులకు అవకాశం కల్పించారు. ఇప్పటికే 18బస్సులు రాగా ఇంకో బస్సు రావాల్సి ఉంది. ఈ లెక్కన పాత బస్సులను మాత్రం తుక్కుగా మార్చే వీలుంది. ఉన్నతాధికారుల ఆదేశాలు రావాల్సి ఉందని ఆర్టీసీ డీఎం రవీంద్రనాథ్ తెలిపారు.

వాహనాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీకాంత్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని 108 అంబులెన్స్‌లు, 1962, 102 అమ్మఒడి వాహనాలను మేనేజర్ శ్రీకాంత్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ మధు బుధవారం తనిఖీ చేశారు. 108 అంబులెన్స్‌లో రికార్డులు, మందులు, సిబ్బంది పనితీరు, అత్యవసర కేసుల్లో ప్రమాదాలు, పాముకాటు, గర్భిణుల తరలింపు అంశాలపై ఆరా తీశారు. గర్భిణులు పురిటి నొప్పులతో బాధ పడుతుంటే 20 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకోవాలని సిబ్బందికి సూచించారు. 102 అమ్మఒడి వాహనాల రికార్డులు, ప్రతీనెల గర్భిణుల చెకప్, డెలివరీ అయ్యాక వారిని సొంత గ్రామానికి ఉచితంగా తీసుకెళ్లడం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ వీఆర్వో బాలాజీ, పైలట్ సతీశ్, మహేందర్, రాజు, సాయిబాబా, గంగాధర్, హరీశ్, శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వడూర్ వైపు నుంచి బైక్‌పై వస్తున్న యువకుడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి షేక్ షాహిన్ వస్తుండగా బైక్ ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దే

- ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు



కరంజి(టి)లో మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు

తాంసి: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు ఆరోపించారు. బుధవారం భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో ప్రజాగోస బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గ్రామంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన ముందుగా గ్రామంలో సవారిబంగ్లా వద్ద రూ.3 లక్షలతో నిర్మించే షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. కరన్‌వాడీ గ్రామానికి చెందిన వినోద్ మాజీ పార్టీ అధ్యక్షుడు తిరిగి బీజేపీ పార్టీలోకి చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం నుంచి కరంజి(టి) గ్రామానికి రావడానికి రోడ్డు బాగా లేక రెండు గంటల పాటు సమయం పట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోడ్లతో పాటు గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జందాపూర్ నుంచి సావర్గాం వరకు రూ.20కోట్లతో కేంద్ర ప్రభుత్వం రోడ్డు కోసం నిధులు మంజూరు చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, మాధవ్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి రామారావు, పార్టీ మండల అధ్యక్షుడు రాకేష్, స్థానిక ఎంపీటీసీ రెడ్డి దేవమ్మ, రమేష్, మండల నాయకులున్నారు.

నేడు అత్యవసర సమావేశం

- తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్



సమావేశంలో నినాదాలు చేస్తున్న తుడుం దెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ నాగోబా దర్బార్‌లో గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో ఏర్పాటు చేసినా సమావేశంలో ఆయన మాట్లాడారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్సా పోచ్చయ్య, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగోబా దర్బార్‌లో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలోని 9 తెగల కుల సంఘాలు, ఆదివాసీ సంఘాలు, రాయిసెంటర్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మేధావులు, సలహాదారులు హాజరు కావాలని కోరారు. అలాగే తుడుందెబ్బ అదిలాబాద్, అసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లా, డివిజన్, మండల కమిటీలతో పాటు సంఘ సభ్యులు, బాధ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, కార్యదర్శి సోయం రాందాస్, మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకా, ఉపాధ్యక్షురాలు ఉయికే ఇంద్ర, విద్యార్థి సంఘం నాయకుడు సలాం వరుణ్, నాయకులు జంగు, సిడాం లక్ష్మణ్, పెందూర్ విలాస్, కుమ్ర వసంత్, కొడప మాధవ్‌రావ్, కుర్సేంగే తానాజీ, ఆత్రం గణపతి, మెడ్మ ముకుంద్ ఉన్నారు.

త్వరగా బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయాలి



ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

జైనథ్: ఇటీవలే కుంగిపోయి ప్రమాదకరంగా మారిన తరోడ బ్రిడ్జిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్త బ్రిడ్జి నిర్మాణ సాధ్యాసాధ్యాలపై అధికారులతో మాట్లాడారు. రహదారి విస్తరణ కోసం జైనథ్–బేల అంతర్రాష్ట్ర రహదారిని ఆర్‌అండ్‌బీ నుంచి నేషనల్ హైవే అధికారులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. కొత్త రోడ్డు పనులు ప్రారంభం కాక ముందే వంతెన కుంగిపోవడంతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరితగతిన బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించి సాధ్యమైనంత తొందరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

బీజేపీ నాయకుల్లో ఫ్రస్టేషన్ కనిపిస్తోంది..

పార్టీలకు అతీతంగా గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి బీజేపీ నాయకులు ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పూసాయి గ్రామంలో రూ. 5లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కంఠ గ్రామంలో ఇటీవలే సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేయగా, మరల ఎంపీ సోయం బాపూరావ్, ఇతర బీజేపీ నాయకులు రెండోసారి భూమి పూజ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేంద్రం నిధులంటూ లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని, ఎంపీ నిధులతో ఏ ఒక్క గ్రామంలోనైనా అభివృద్ధి పనులు చేపట్టారా? అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్దన్, నాయకుల సర్సన్ లింగారెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ ఎద్మల పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరిశీలన

మండలంలోని తరోడా వంతెనను బీజేపీ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జోగురామన్న వల్లనే ఇవాళ ఈ దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కిష్టారెడ్డి, సంతోశ్‌రెడ్డి, కిష్టన్న దేవిదాస్ ఉన్నారు.

తరోడ బ్రిడ్జి పూర్తిగా మూసివేత

జైనథ్ మండలంలోని తరోడ బ్రిడ్జిని అధికారులు పూర్తిగా మూసివేశారు. ఇటీవలే బ్రిడ్జి కుంగిపోవడంతో వాహనాల రాకపోకలను అధికారులు నిషేధించారు. అయినప్పటికీ పాదాచారులు, ద్విచక్రవాహనదారులు బ్రిడ్జి గుండా రాకపోకలు చేస్తుండడంతో అధికారులు బ్రిడ్జికి అడ్డంగా గోడ నిర్మించి, రాకపోకలను పూర్తిగా నిషేధించారు. నిరాల, లాండసాంగ్వి గ్రామాల మీదుగా ఆదిలాబాద్ వెళ్లేందుకు ప్రత్యామ్నాయం ఉన్నప్పటికీ కూడా దూర భారం విపరీతంగా పెరగడంతో ద్విచక్ర వాహనదారులు బ్రిడ్జి కింద వాగులోంచి ప్రయాణాలు చేస్తున్నారు.



బ్రిడ్జికి అడ్డంగా గోడ నిర్మించిన అధికారులు

కడెం చివరి ఆయకట్టు వరకు నీరందించాలి



కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గూడెం లిఫ్ట్ ద్వారా కడెం చివకి ఆయకట్టు వరకు కూడా సాగు నీరు అందించాలని రైతులు బుధవారం కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. 42 డిస్ట్రిబ్యూటరీ కాలువ పరిధిలోని హాజీపూర్ మండలంలోని రైతుల పొలాలకు సాగు నీరందక పంట పొలాలు ఎండి పోతున్నాయన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ చెరువులు కూడా ఎండిపోతున్నాయని తెలిపారు. కడెం 30, 31, 32 డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని కాలువలకు నీళ్లు రానివ్వడం లేదని పేర్కొన్నారు. మండలంలోని రైతాంగానికి పోలీస్ బందోబస్తు మధ్య 42వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా హాజీపూర్ మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంట పొలాలు కాపాడాలని, చెరువులు నింపాలని కోరారు. వినతిపత్ర అందించిన వారిలో రైతుబంధు సమితి మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, రైతు సభ్యులు బేర పోచం, దొమ్మాటి సత్తయ్య, దొమ్మటి బాపు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



జాదవ్ రాయిచందర్ (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని వెంకటపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాయిచంద్(58) బుధవారం ఉదయం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై మారుతి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొన్ని రోజుల నుంచి రాయిచంద్ మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 20న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పోచమ్మ ఆలయంలో చోరీ

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంలోని అశోక్‌రోడ్డులోని పోచమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. రెండు వెండి కిరీటాలు, పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. ఉదయం పూజారి ఆలయానికి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గమనించి ఆలయ కమిటీ సభ్యులతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పెంబి: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొసగుట్ట ఆశ్రమ పాఠశాలలో బుధవారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. రూ.60లక్షలతో నూతన ఆశ్రమ పాఠశాల భవనాన్ని నిర్మిస్తామన్నారు. కార్పొరేట్ దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మార్చిన ప్రధానోపాధ్యాయులను అభినందించారు. అంతకుముందు పాఠశాలలోని ప్రాజెక్ట్ గదిని ప్రారంభించారు. పాఠశాల క్యాలెండర్, విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, ఎంపీపీ కవిత గోవింద, జెడ్పీటీసీ జానుబాయి, వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఎంపీవో సుధాకర్‌రెడ్డి, ఏసీఎంవో శివాజీ, ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్, నాయకులు గోవింద్, టీకజీ, సదాశివ్, విక్రమ్ నాయక్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తమ హక్కు అనే భావన కలుగాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల్‌రెడ్డి
- అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకుల సరఫరాపై అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల్ రెడ్డి

కైలాస్‌నగర్: నాణ్యమైన పౌష్టికాహారం పొందడం చట్ట ప్రకారం తమ హక్కు అనే భావన ప్రజల్లో కలిగినప్పుడే ఆహార భద్రత సాధ్యపడనుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ కె.తిరుమల్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో ఆహార భద్రత చట్టం–2013 అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇంటింటికీ ఉచిత బియ్యం పంపిణీ, విద్యాలయాల్లో మధ్యాహ్న భోజన పథకం, సంపూర్ణ పోషణ, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందించే భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల కిషోర బాలికలు, బాలింతలు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై ఆయా శాఖల వారీగా సమీక్షించారు. మన్నూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌కు సరుకులను సక్రమంగా సరఫరా చేయడం లేదని, తాము తనిఖీ కి వెళ్లిన సమయంలో గుర్తించామన్నారు. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యంలో బయట దొరికే బియ్యం కంటే ఎక్కువ పోషకాలు ఉంటాయన్నారు. ఈ రేషన్ బియ్యం వినియోగం పెంచేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆహార భద్రత చట్టం ప్రకారం పౌష్టికాహారం పొందడం ప్రతి ఒక్కరి హక్కు అని, దాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, అడిషనల్ కలెక్టర్లు నటరాజన్, రిజ్వాన్ భాషా షేక్, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ పి.శ్రీజ పాల్గొన్నారు.

లక్ష్మణ్ మృతదేహం స్వాధీనం



లక్ష్మణ్ కుటుంబీకులతో మాట్లాడుతున్న పోలీసులు

భైంసారూరల్: ఇలేగాం కొత్త చెరువులో గల్లంతైన లక్ష్మణ్(22) మృతదేహం బుధవారం లభ్యమైంది. మంగళవారం చెరువులో గల్లంతైన లక్ష్మణ్ బుధవారం శవమై కనిపించాడు. మృతదేహాన్ని బయటకు తీయడంతో కుటుంబీకులు తమకు న్యాయం చేయాలని బైఠాయించారు. విషయం తెలుసుకున్న భైంసా రూరల్, ముధోల్ సీఐలు చంద్రశేఖర్, వినోద్ సంఘటన స్థలానికి చేరుకుని వారితో మాట్లాడి శాంతింపజేశారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



'మోదుగ'.. అందాలు

మోదుగపూల అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. శశిర రుతువులో పూసే మోదుగపూలను మహాశివరాత్రి పర్వదినాన భక్తులు శివుడి పూజలో వాడతారు. అలాగే హోలీ సందర్భంగా ప్రకృతి ప్రసాదించిన మోదుగ చెట్ల పూలతోనే సహజసిద్ధమైన రంగులు తయారు చేసుకుని సంబురాలు జరుపుకొంటారు. కుంటాల మండల కేంద్రంలో ఇలా విరగబూసిన మోదుగ చెట్టు చూపరులను ఆకట్టుకుంటోంది. - కుంటాల